సాక్షి
వికారాబాద్

ఆదివారం । 24 । నవంబర్ । 2024



గిరిజన నేత దారుణ హత్య

గిరిజన నేత దారుణ హత్యకు గురైన సంఘటన ధారూరు మండలంలో శుక్ర వారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. 8లో▸



ఎన్నికల హామీల అమలు

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



రైతులకు ఇబ్బంది కలగొద్దు

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలని ఆర్డీఓ వాసుచంద్ర సూచించారు. 9లో▸

న్యూస్‌రీల్

పెన్షన్ పెంపు హామీని అమలు చేయండి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న దివ్యాంగులు

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించే దాకా ఉద్యమం ఆగదని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన పెన్షన్ల పెంపును వెంటనే అమలు చేయాలని కోరుతూ 6 రోజులుగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం హామీ అమలు చేయకుంటే 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. నిరాహార దీక్షలో రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్, రాజు, సత్యనారాయణ రెడ్డి, జయశ్రీ, దేవదాసు, మల్లేశం, అనంతయ్య, యాదప్ప, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు



అనంతగిరి: మహారాష్ట్రలో బీజేపీ గెలుపుతో వికారాబాద్‌లో శనివారం ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బాణసంచా పేల్చి స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

డీఈఓ రేణుకాదేవి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ, పాఠశాల సిబ్బంది

పరిగి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ రేణుకాదేవి ఆదేశించారు. శనివారం పరిగి పట్టణంలోని నంబర్ 1, నంబర్ 2 ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి తరగతి గదుల్లో పర్యటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వంట ఏజెన్సీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లలను త్వరలోనే జమ చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాఠశాలల్లో నెలకొన్న మరుగుదొడ్లు, డ్రైనేజీ, కిచెన్ షెడ్ సమస్యలను డీఈఓకు వివరించారు. స్పందించిన ఆమె సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల్లో పురోగతి ఉండాలి

డీసీపీ శ్రీనివాస్



చేవెళ్ల: పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల్లో వేగవంతమైన పురోగతి ఉండాలని డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఏసీపీ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏసీపీ పరిధిలోని పోలీస్ అధికారులతో సమావేశమై పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులపై సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేవెళ్ల ఏసీపీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యాలయం పరిసరాలు పచ్చదనంతో పరిశుభ్రంగా ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ బి.కిషన్, ఇన్‌స్పెక్టర్లు భూపాల్ శ్రీధర్, పవన్‌కుమార్‌రెడ్డి, కాంతారెడ్డి, డీఐ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయుడు తదితరులు ఉన్నారు.

నేడు ఆఖరు

నేటితో ముగియనున్న ఓటరు స్పెషల్ క్యాంపెయిన్

- ఇప్పటికే డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల
- జిల్లాలో మొత్తం ఓటర్లు 9,90,858
- జనవరి 6న తుది జాబితా

డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్ జెండర్స్
పరిగి	1,34,482	1,34,092	09
వికారాబాద్	1,15,531	1,17,339	14
తాండూరు	1,19,081	1,26,853	07
కొడంగల్	1,19,585	1,23,860	05



దౌల్తాబాద్‌లో ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఓటరు తుది జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి గత నెల డ్రాఫ్ట్ నోటిఫికేషన్(ముసాయిదా ఓటరు జాబితా)ను విడుదల చేసింది. ప్రస్తుతం ఓటరు జాబితా 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్ నిర్వహిస్తోంది. గతేడాది అక్టోబర్‌లో విడుదల చేసిన ఓటరు తుది జాబితా ప్రకారం తీసుకుంటే ప్రస్తుతం జిల్లాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ నాలుగు స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌ను ప్రకటించగా నేటి (ఆదివారం)తో ఈ ప్రక్రియ ముగియనుంది. ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. జనవరి 6న ఓటరు తుది జాబితాను విడుదల చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు విడుదల చేసిన ఓటరు జాబితాతో పోలిస్తే ప్రస్తుతం భారీగా ఓట్లు పెరిగాయి. ఓటరు నమోదుకు మరో ఐదు రోజుల గడువు ఉండటంతో మరింత పెరిగే అవకాశం ఉంది.

భారీగా పెరిగిన ఓటర్లు

జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. గత ఏడాది జిల్లాలో 9,34,523 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 56,335 మంది పెరిగారు.. గత నెల అధికారులు విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో 9,90,858 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 4,88,679 మంది పురుష ఓటర్లు, 5,02,144 మంది మహిళా ఓటర్లు, 35 మంది ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 13,465 మంది అధికంగా ఉన్నారు.

28 వరకు ఓటరు నమోదుకు అవకాశం

జిల్లాలో ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల కోసం ఈ నెల 28వ తేదీ వరకు అవకాశం ఉంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఏటా ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన తర్వాత కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇవ్వడంతో పాటు చనిపోయిన వారి పేర్లు, నివాసం మారిన వారి పేర్లను తొలగిస్తూ వస్తోంది. అలాగే పేర్ల సవరణకు.. ఓటును మరో చోటికి మార్చుకునేందుకు అవకాశం ఇస్తోంది. ఇందులో భాగంగా నాలుగు స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించగా నేటితో ఆ ప్రక్రియ ముగియనుంది. ఈ నెల 28వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి జనవరి 6న ఓటరు తుది జాబితాను ప్రకటించనున్నారు. జనవరి ఒకటి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చిన గరుడ యాప్ ద్వారా కూడా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి

ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశాం. ఈ జాబితాను రాజకీయ పార్టీల నాయకులు పరిశీలించాలి. వారి నుంచి అభ్యంతరాలు, ఆక్షేపణలు తీసుకున్నాం. ఓటరు నమోదుకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉంది. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి. జనవరి 6న తది జాబితాను విడదల చేస్తాం.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్



సర్వే ఫామ్‌పై సంతకం చేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

జీవన ప్రమాణాల మెరుగుకే సర్వే

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకే ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్‌లో నిర్వహించిన సర్వేలో ఎన్యుమరేటర్‌కు తన కుటుంబ సమాచారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరిస్తున్నారని తెలిపారు. పేద వర్గాలకు ఇది మేలు చేస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. జిల్లాలో 86శాతం సర్వే పూర్తయిందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ పార్కును అభివృద్ధి చేస్తాం

పర్యాటకులకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించేందుకు అనంతగిరి అర్బన్ పార్కును అభివృద్ధి చేస్తామని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం అనంతగిరి అటవీ ప్రాంతం ఘాట్ రోడ్డులోని నంది విగ్రహం వద్ద అర్బన్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ క్వార్టర్‌ను కలెక్టర్ ప్రతీక్‌జైన్, అటవీశాఖ చార్మినార్ జోన్ చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక వర్గీశ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనంతగిరి భగవంతుడి ప్రసాదం అని, అందమైన ప్రదేశమన్నారు. అనంతగిరిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. 200 ఎకరాల్లో అర్బన్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతగిరి గుట్ట అభివృద్ధికి రూ.300 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఉపాధి హామీ పథకం కింద చెక్‌డ్యాంలు నిర్మించాలని ఆదేశించారు. రైతు రుణమాఫీపై ప్రతిపక్షాలు అనవసరాద్ధాంతం చేస్తున్నాయని అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, ఆర్డీఓ వాసుచంద్ర, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మహిపాల్‌రెడ్డి, ముత్తాహార్ షరీఫ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కర్ణాటక మంత్రి ప్రకాష్‌పాటిల్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి కృషి

- కర్ణాటక మంత్రి శరణు ప్రకాష్ పాటిల్
- నవాంద్గి – హాల్కోడ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాండూరు: అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని కర్ణాటక వైద్య విద్యాశాఖ మంత్రి శరణు ప్రకాష్‌పాటిల్ అన్నారు. శనివారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఇరు రాష్ట్రాల సరిహద్దులోని నవాంద్గి – హాల్కోడ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థానన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరిహద్దు ప్రాంతాల్లో ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడారు. రెండు రాష్ట్రాల సహకారంతో సరిహద్దు ప్రాంతాల ప్రజలకు రవాణా సదుపాయాలు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శోభరాణి, నాయకులు డాక్టర్. సంపత్‌కుమార్, వెంకటేష్, నరేష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

తావు విడిస్తే.. సావొస్తది

ప్రాణాలకు తెగించి పోరాడుతున్నాం

- కోటి పరిహారం ఇచ్చినా భూములిచ్చేది లేదు
- ఫార్మా బాధిత రైతులు



రోటిబండ తండా వాసులతో సమావేశమైన ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యులు

దుద్యాల్: తావు విడిస్తే సావొచ్చే అవకాశం ఉందని ఫార్మా బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం దుద్యాల్ మండలం లగచర్ల, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాల్లో పర్యటించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ ముందు పలువురు భూ బాధితులు గోడును వెల్లబోసుకున్నారు. ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం మా భూములను బలవంతంగా తీసుకునేందుకు ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. తండాల ఉనికే లేకుండా చేయాలని కంకణం కట్టుకుందని మండిపడ్డారు. తరతరాలుగా పొలాలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, మమ్మల్ని రోడ్డుపాలు చేసేందుకు కుట్ర జరుగుతోందని అన్నారు. ఈ నెల 11న లగచర్లలో అధికారులు, రైతుల మధ్య చోటుచేసుకున్న ఘటన తర్వాత చాలా మంది భయంతో తండాలకు రావడం లేదన్నారు. కొంత మందిపై అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా అరెస్టు చేసి జైలులో ఉంచారని తెలిపారు. ఫార్మాసిటీకి భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. మాకు ఎలాంటి పరిహారం వద్దని, కోటి రూపాయలు ఇచ్చినా భూముల ఇవ్వమని స్పష్టం చేశారు. ఉన్న పొలంలోనే పంటలు పండించుకొని జీవనం సాగిస్తామని తెలిపారు.

మా భూములు ఇవ్వం



ఏడాదికి రెండు పంటలు పండించుకుంటున్నాం. పచ్చటి పొలాల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయరాదు. మా భూములను ఎట్టిపరిస్థితుల్లో ఇవ్వం. నేను నిండు గర్భిణిని.. నా భర్తను అరెస్ట్ చేసి జైలులో ఉంచారు. డెలివరీ సమయం.. ఎలాగైనా మా ఆయన్ను విడిచిపెట్టాలి. మాకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీలో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం.

– జ్యోతి, పులిచెర్లకుంట తండా

భయంతో బతుకుతున్నాం



ఎప్పుడు ఎవరొచ్చి తీసుకెళ్తారో అనే భయంతో బతుకుతున్నాం. తప్పు చేయని వారిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. నేను పాలు పోయడానికి వెళ్తుంటే పోలీసులు తీసుకెళ్లారు. ఆ తర్వాత వదిలిపెట్టారు. తండాలో స్వేచ్ఛగా తిరగలేక పోతున్నాం. మా భూముల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయరాదు. తండాల్లో ప్రశాంత వాతావరణం కోసం అధికారులు కృషి చేయాలి.

– రూప్ సింగ్ నాయక్, రోటిబండ తండా



విరిగిన తలుపు..



మరమ్మతుల అనంతరం..

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

సొంత ఖర్చులతో తలుపు, కిటికీలకు నెట్ అమర్చిన వార్డెన్

సాక్షి ఎఫెక్ట్..

యాలాల: మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో అధ్వాన స్థితికి చేరిన తలుపులు, కిటికీలకు మరమ్మతులు చేయించారు. శనివారం సాక్షి దినపత్రికలో చలి పంజా.. విద్యార్థుల గజగజ శీర్షికన ప్రచురితమైన కథనానికి బాలుర వసతి గృహ వార్డెన్ బాలరాజు స్పందించారు. సొంత డబ్బు ఖర్చు చేసి విరిగిన తలుపు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయించారు. దెబ్బతిన్న కిటికీలకు నెట్ ఏర్పాటు చేయించారు. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసిందని వార్డెన్ బాలరాజు తెలిపారు.



దెబ్బతిన్న కిటికీలు..



బాగుచేసిన తర్వాత..

హిందూ ఆలయాలకు భద్రత కరువు



శివలింగం చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ

- రాష్ట్రంలో మతకల్లోలాలు సృష్టించేందుకు కుట్ర
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలి
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో మతకల్లోలాలు సృష్టించేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఫరూఖ్‌నగర్ (వివేకానందనగర్)లోని బసవన్న దేవాలయంలో శివలింగం చోరీ నేపథ్యంలో శనివారం ఆమె ఆలయాన్ని సందర్శించారు. వివరాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో హిందూ దేవాలయాలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు కుట్ర పూరితంగా దాడులు చేయడం, విగ్రహాలను ధ్వంసం చేయడం చేస్తున్నారని అన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కుట్రలు చేస్తూ వికృతానందం పొందుతున్నారని విమర్శించారు. మతాల మధ్య చిచ్చు పెట్టి, మతకల్లోలాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఆలయాల్లో సరైన నిఘా ఏర్పాటు చేయకపోవడంతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పదించాలని డిమాండ్ చేశారు. శివలింగాన్ని ఎత్తుకెళ్లిన వారు ఎవరు, ఈ కుట్ర వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలో పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, నాయకులు చెంది మహేందర్‌రెడ్డి, సుభాష్, శివానందస్వామి, చెట్ల వెంకటేశ్, ఆకుల ప్రదీప్, మల్చలం మురళి, ప్యాట అశోక్, కాసోజు శివ, మఠం రుషికేష్, ఎంకనోళ్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైకు దొంగకు దేహశుద్ధి



బైకును ఎత్తుకెళ్తున్న దొంగ (సీసీ ఫుటేజీలో రికార్డైన వీడియో)

తాండూరు టౌన్: పార్కింగ్ చేసిన బైకును ఎత్తుకెళ్లిన దొంగ మరో బైకును ఎత్తుకెళ్లేందుకు వచ్చి స్థానికుల చేతికి చిక్కాడు. ఈ ఘటన తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటన దృశ్యాలు అక్కడ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. పట్టణంలోని మల్లప్ప మడిగ సమీపంలో పార్కింగ్‌లో నిలిపి ఉంచిన బైకును ఓ దొంగ ఎత్తుకెళ్లాడు. కాసేపటికి మరో అక్కడికే వచ్చి మరో బైకును ఎత్తుకెళ్తుండగా గమనించిన స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతనిని అప్పగించారు. సదరు దొంగ మద్యం మత్తులో బైకులను ఎత్తుకెళ్లాడని అతనిని మందలించి పంపేసినట్లు సీఐ సంతోష్ కుమార్ తెలిపారు.

వేధింపుల ఆరోపణలు అవాస్తవం

డీఎం కరుణశ్రీ

పరిగి: పరిగి ఆర్టీసీ డిపో కంట్రోలర్ భూపతి రెడ్డి ఆత్మహత్యకు అధికారుల వేధింపులే కారణమనేది అవాస్తవమని డీఎం కరుణశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపతి రెడ్డి ఈ నెల 19న విధులు నిర్వహించారు. 20న వీక్లీ ఆఫ్ ఉంది. దీంతో ఆయన 21, 22 తేదీల్లో విధులకు హాజరవ్వలేదన్నారు. మూడు రోజులుగా విధులకు దూరంగా ఉన్న భూపతి రెడ్డిని తాము ఎలా వేధిస్తామన్నారు. పరిగి డిపోలో అధికారులు ఎవరినీ కూడా వేధించరని తేల్చి చెప్పారు.

ఆలయాభివృద్ధికి కృషి

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

కొందుర్గు: దేవాలయం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ హామీ ఇచ్చారు. శనివారం కార్తీక మాసం సందర్భంగా మండల పరిధిలోని సంజీవపురం చింతల్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డీకేఈ అరుణ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి బావనతో మెలగాలని, ఆద్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు అందె బాబయ్య, భూపాలచారి, శివారెడ్డి, ప్రభులింగం, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నేత దారుణ హత్య

- రాజకీయ కక్షలా.. వివాహేతర సంబంధమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- పోలీసుల అదుపులో అనుమానితులు?



పండరి (ఫైల్)

ధారూరు: ఓ గిరిజన కాంగ్రెస్ నేత దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని కుమ్మర్‌పల్లి పంచాయతీ అనుబంధ గ్రామం బోజ్యానాయక్ తండా సమీపంలోని కొత్త చెరువు అలుగు వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఘటనా స్థలిని శనివారం వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు సీఐ రఘురాం, ఎస్‌ఐ వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. పంచనామా చేసి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది సహకారంతో వివరాలు సేకరించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ నిర్వహిస్తున్న వడ్త్యా పండరి(34) శుక్రవారం ఉదయం అక్కడ నుంచి తన భార్యకు ఫోన్ చేసి స్వగ్రామానికి వెళ్తున్నట్లు చెప్పాడు. అదేరోజు మధ్యాహ్నం వరకు తండాలో విందు చేసుకుని సాయంత్రం వికారాబాద్ వెళ్లాడు. అక్కడ మాంసం తీసుకుని తిరిగి తండాకు చేరుకున్నాడు. వదినకు కూర వండమని చెబుతుండగా ఫోన్ రావడంతో మళ్లీ వస్తానని చెప్పి వెళ్లిపోయిన వ్యక్తి శనివారం తెల్లవారుజామున కొత్త పల్లి చెరువు అలుగు కింద శవంగా తేలాడు. అటుగా వెళ్లిన స్థానికులు పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడకి చేరకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసి గొంతు నులిమి హత్య చేసినట్లు భావిస్తున్నారు. డాగ్ స్క్వాడ్ ముందుగా తండా సమీపంలోని సంజప్పదరి వద్దకు పరగుతీయడంతో పోలీసులు అక్కడ విందు చేసుకున్న ఆనవాళ్లు గుర్తించారు. విందులో పాల్గొన్న వారే వెనుక నుంచి వచ్చి దాడి చేసి హత్యచేసినట్లు అనుమానిస్తున్నారు. శవం వాసన చూసిన అనంతరం డాగ్ స్క్వాడ్ చెరువు పరిసరాల్లో తచ్చాడుతూ చివరకు రోడ్డుపైకి ఎక్కింది. హంతకులు హత్యానంతరం అక్కడ నుంచి వేరే వాహనంలో పరారీ అయినట్లు పోలీసులు భావిస్తున్నారు. కాగా ఘటనా స్థలిలో గాజులు గుర్తించిన క్లూస్ టీం సిబ్బంది వివాహేతర సంబంధమేమైనా ఉందా అనే కోణంలోనూ విచారిస్తున్నారు. భార్య దివ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన వ్యక్తులు ప్రమాదంగా చిత్రీకరించేందుకు బైక్‌ను అక్కడ పడేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఇప్పటికే అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.



బోజ్యానాయక్‌తండా వైపునకు పరుగుతీస్తున్న డాగ్‌స్క్వాడ్



ఘటనా స్థలిలో విలపిస్తున్న మృతుడి కుటుంబీకులు

మూడు రోజులు తండాలో

కాంగ్రెస్ నేత పండరి 2009లో నగరంలోని హైటెక్ సిటీ ప్రాంతానికి చెందిన దివ్యను ప్రేమ వివాహం చేసుకున్నాడు. లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ స్థలాన్ని లీజుకు తీసుకుని అక్కడే మకాం పెట్టాడు. వీరికి పదోతరగతి చదువుతున్న కుమారుడు పవన్ సంతానం. బోజ్యానాయక్‌తండాలో వ్యవసాయం సైతం చేస్తుండడంతో వారంలో మూడు రోజులు తండాలో నాలుగు రోజులు హైటెక్‌సిటీలో ఉంటాడని తండా వాసులు తెలిపారు. 2018లో కాంగ్రెస్ నుంచి సర్పంచ్‌గా ఓటమిపాలయ్యాడు. మరోసారి పోటీకి సిద్ధమవుతుండగా హత్యకు గురయ్యాడు.



దౌల్తాబాద్: గోదాంలో వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

సమన్వయంతో కొనుగోళ్లు చేపట్టాలి

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి
- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

దౌల్తాబాద్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం గురించి నిర్వాహకులను అడిగి తెలు సుకున్నారు. అధికారులు సిబ్బంది సమన్వ యంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రి య పూర్తి చేయాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సన్నరకం ధాన్యం కొనుగోలు చేస్తే రైస్‌మిల్లు కేటాయించలేదని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సోమవారం వరకు సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం దౌల్తాబాద్‌లో ఉన్న ధాన్యం గోదాంను పరిశీలించారు. ఆయన వెంట డీటీ శివకుమార్‌రెడ్డి, సిబ్బంది వెంకటేశ్, ఏఈఓ వైష్ణవి తదితరులున్నారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

దౌల్తాబాద్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సదరు అధికారులపై చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ హెచ్చరించారు. శనివారం ఆయన మాటూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. బియ్యం సరిగా లేకపోతే వెనక్కు పంపించాలని నిత్యావసర సరుకులు నాణ్యత పా టించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో డీటీ నర్సింహారెడ్డి, హెచ్‌ఎం భీమేష్, పంచాయతీ కార్యదర్శి మల్లప్ప తదితరులున్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌తో కలిసి బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల ఆదుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం శ్రమిస్తుందన్నారు. మండల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నామన్నారు. మేకల సంతకు కావాల్సిన స్థలంలో ప్రహరీ నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. మార్కెట్ వచ్చే రైతులకు ప్రతీ మంగళవారం మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశామన్నారు. మార్కెటులో కావాల్సిన అన్ని సదుపాయాలను రైతులకు కల్పిస్తామన్నారు. మోమిన్‌పేట, బంట్వారం మండల కేంద్రాలలో గోడౌను నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరాజుద్దీన్, ఎజాస్, శ్రీనివాస్, ఎరాజ్ ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

రూ.4 కోట్ల నిధులతో అర్బన్ పార్క్

- నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: నియోజకవర్గ అభివృద్ధిని నిరంతరం కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని జాపర్‌పల్లి గ్రామ సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్న అర్బన్ పార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాపర్‌పల్లి ప్రధానరోడ్డు పక్కన ఏర్పాటు చేయడంతో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుందని షాద్‌నగర్, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారు సేదతీరేలా రూ.4కోట్ల నిధులు వెచ్చించి 120 ఎకరాల్లో అర్బన్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో ప్రత్యేక నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ ప్రతిమా, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి, తౌర్యానాయక్, రాజాపుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరిగి: జాపర్‌పల్లిలో అర్బన్ పార్క్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

పూడూరు: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చింతలపల్లి, బాకాపూర్ గ్రామాల్లో రూ.2.45 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతీ నియోజకవర్గానికి రూ.300 కోట్ల వరకు రుణమాఫీ జరిగిందన్నారు. ఎవరికైనా మాఫీ కాని ఎడల జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. అనంతరం బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీశ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు పెంటయ్య, శ్రీనివాస్, షకీల్, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింలు, భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల ప్రారంభోత్సవం

దోమ: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలో రూ.6కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లోని కాలనీల్లో సీసీ రోడ్లు, యూజీడీ వ్యవస్థ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం దిర్సంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

వివాదాస్పద భూమి సర్వే

మూడు ఎకరాలు కబ్జా చేసినట్లు గుర్తించిన సర్వేయర్లు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం శివారులో వివాదస్పద భూమిని రెవెన్యూ అధికారులు శనివారం సర్వే చేపట్టారు. గ్రామ శివారులో సర్వేనెంబర్ 58 బై 3తో పాటు 58 బై 4లో జహీర్‌కు రెండు ఎకరాలు, జరీనా బేగంకు నాలుగు ఎకరాల భూమిలో క్రషర్ మిషన్ కొనసాగుతోంది. అయితే పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో ప్రహరీ నిర్మిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు సర్వేయర్ మహేష్ తన బృందంతో శనివారం డిజిటల్ సర్వే నిర్వహించారు. జహీర్‌కు సంబంధించిన క్రషర్ మిషన్ ఆరు ఎకరాలకు బదులుగా తొమ్మిది ఎకరాల్లో ఉన్నట్లు సర్వేలో తేలింది. జహీర్ అదనంగా ప్రభుత్వ భూమిని మూడు ఎకరాలు కబ్జా చేశారని సర్వేయర్ తెలిపారు. ఈ నివేదికను తహసీల్దార్‌కు అందజేస్తానన్నారు. కాగా మూడు ఎకరాలు వదిలేస్తానని జహీర్ రెవెన్యూ అధికారులకు చెప్పారు. వడ్డె శ్రీను, శాంతు ,మొగులప్ప, కృష్ణ, రాజు, మాణిక్యం, మహేందర్ సర్వేలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొందుర్గు: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్ల ప్రసాద్(45) విద్యుత్ సరఫరా కావడం లేదని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు వేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యా రేణుక, కుమారుడు ఉన్నారు. ఈ విషయమై ఇంకా ఫిర్యాదు అందలేదని జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు తెలిపారు.

చిన్నబోయిన వైకల్యం

దివ్యాంగుడికి డాక్టరేట్



జానయ్యకు డాక్టరేట్ పట్టా అందజేస్తున్న సాహితీవేత్తలు, అధికారులు

మొయినాబాద్: వైకల్యం శరీరానికే కానీ మేధస్సుకు లేదని నిరూపించాడు ఓ దివ్యాంగుడు. ప్రైవేటు పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తూ జానపదాలు, కవితలు రాస్తూ, పాటలు పాడుతూ కవిగా, గాయకుడిగా ఎదిగి డాక్టరేట్ అందుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. దివ్యాంగుడైన ఆరింపుల జానయ్య పెద్దమంగళారం రెవెన్యూలోని మమత ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్నారు. ఇతని కళలను గుర్తించిన హైదరాబాద్ ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ సంస్థ అతనికి జానపద కవి, గాయకుడిగా డాక్టరేట్ ప్రదానం చేసింది. నగరంలోని అల్‌లెడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తలు, మా అసోసియేషన్ చైర్మన్, ప్రభుత్వ అధికారుల చేతులమీదుగా డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టరేట్ రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

యాలాల: మండల పరిధిలోని ముద్దాయిపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ఐకేపీ సిబ్బందిని అడిగి ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు తెలుసుకున్నారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో వ్యవసాయ అధికారులు జారీ చేస్తున్న టోకెన్లు, ధాన్యం తేమ శాతం , గన్నీ బ్యాగుల వివరాలు తెలుసుకున్నారు. ధాన్యాన్ని కేంద్రంలో నిల్వ ఉంచకుండా వెంటనే తూకం వేసి బిల్లులు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఏఈఓ శిరీష, ఐకేపి సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజన పరిశీలన

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సబ్ కలెక్టర్ ఉమాశంకర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పంపిణీలో మెనూ తప్పక పాటించాలని నిర్వాహకులు సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్, అనిల్‌కుమార్, వెంకటయ్య, మల్లయ్య తదితరులున్నారు.



ముద్దాయిపేట కొనుగోలు కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న ఉమాశంకర్ ప్రసాద్

విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యం

టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా ఐక్యత ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొంది పలువురు యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ఎంతో సంతోషానిస్తోందన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో ఐదురోజులుగా నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. క్యాంపులో కంటి ఆపరేషన్లు నిర్వహించుకున్న వారితో ముచ్చటించారు. అంతకుముందు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల కోచింగ్ క్యాంపులో శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పదిమందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం మరోసారి క్యాంపు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా శంకర నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, శేఖర్, ఖాదర్, రాజశేఖర్, మైసయ్య, కొండల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.



కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారితో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఎన్నికల హామీల అమలు

- అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అనినారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని రైతు వేదికలో 54 మంది లబ్ధిదారులకు రూ.54,06,264 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, తొమ్మిది మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. వ్యవసాయ రంగాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే రూ.18వేల కోట్ల రైతు రుణ మాఫీ చేశామని గుర్తు చేశారు. దేశంలో బీసీ కుల గణన చేపట్టిన రాష్ట్రం మనదే అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందర్, నాయకులు వెంకటేష్ మహరాజ్, మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కలాల్ నర్సింలు, లక్ష్మణరావు, రామ్‌నాయక్, మాణిక్‌రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



బషీరాబాద్: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పరామర్శ

యాలాల: మండల పరిధిలోని బెన్నూరుకు చెందిన ప్రైవేటు లెక్చరర్ గోవర్ధన్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబాని అండగా ఉంటామని ధైర్యం ఇచ్చారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, మాజీ సర్పంచ్ హన్మంతు తదితరులు ఉన్నారు.

ఆలయాలపై దాడులు అరికట్టండి

- శివలింగం చోరీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి
- వీహెచ్‌పీ రాష్ట్ర నాయకుడు సుభాష్
- హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆలయంలోని శివలింగాన్ని చోరీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు సుభాష్ డిమాండ్ చేశారు. బసవన్న దేవాలయంలో శివలింగం చోరీ ఘటనపై శనివారం భజరంగ్‌దళ్ పిలుపు మేరకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో హిందూ వాహిని, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఫరూఖ్‌నగర్ నుంచి పట్టణ ముఖ్యకూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టిన అనంతరం రోడ్డుపై బైఠాయించారు. నిరసనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించే క్రమంలో హిందూ సంఘాల నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాలపై దాడులు పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శివలింగం చోరీ జరిగి రెండు రోజులు గడుస్తున్నా పోలీసులు నిందితులను గుర్తించలేకపోయారని అన్నారు. అనంతరం కొత్తకోట ధర్మశాస్త్ర పీఠాధిపతి శివానందస్వామి మాట్లాడుతూ.. ఇది ముమ్మాటికి ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అన్నారు. అనంతరం వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. ఆలయాలపై దాడులకు పాల్పడిన నిందితులను గుర్తించకుండా హిందువులపైనే ఆంక్షలను పెట్టడం సరికాదన్నారు. హిందూ దేవాలయాలను కాపాడుకునేందుకు శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని చేపడితే పోలీసులు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శివలింగాన్ని ఎత్తుకెళ్లిన దుండగులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రుషికేష్, శివ, అశోక్, వంశీ, మురళి, రమేష్, వంశీ, విజయ్, వినయ్, శివానంద్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.